ప్రజావాణి ఫిర్యాదుపై స్పందించిన డీసీ



గౌతమీనగర్‌లో పర్యటిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుకు చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి స్పందించారు. గౌతమీనగర్‌కాలనీలోని ఓపెన్ స్థలం, రోడ్లు, డ్రైనేజీ పార్కు స్థలాలను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజావాణిలో జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కాలనీ సమస్యలపై ఫిర్యాదు చేయగా అందుకు డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించా ఈ పర్యటన చేశారు.

చండీ మహారుద్ర యాగం ప్రారంభం

మోతీనగర్: లోక కల్యాణార్థం, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించడానికి యాగాలు, యజ్ఞాలు, హోమాలు తరచూ నిర్వహిస్తుంటామని భరద్వాజ శ్రీ విద్యాపీఠం వ్యవస్థాపకులు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ శర్మ అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంసీహెచ్ ఎస్, భరద్వాజ శ్రీ విద్యాపీఠం ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణ శ్రీ చండీ మహా రుద్ర యాగం ఘనంగా ప్రారంభమైంది. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్వికరణములు, శ్రీ చక్రవర్ణ పూజ, అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు స్వయంగా రాపిడితో అగ్నిని పుట్టించారు. కార్యక్రమంలో హనుమంతరావు, అంజిరెడ్డి, బిజముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

మోతీనగర్: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్‌లో శుక్రవారం ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినాయకరావుతో కలిసి పర్యటించారు. న్యూ అల్లాపూర్‌లో రూ.40 లక్షల వ్యయం, కేసీఆర్ నగర్‌లో రూ.16 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం. గురువారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ వెయ్యి, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా, 11 మందికి రూ .2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులపై అనుసరిస్తున్న విధానం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రైతులకు అనేక పథకాలను అందించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంట వేసిన వారికి మాత్రమే రైతు భరోసాను అందజేస్తామని ప్రకటించడం చాలా బాధాకరమన్నారు.

అమీన్‌పూర్‌లో కూల్చివేతలు

పటాన్ చెరు: అమీన్‌పూర్‌లో అనుమతులు లేని నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశామని తెలిపారు. శుక్రవారం అమీన్‌పూర్‌లో సర్వే నంబర్ 947లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో నోటీసు ఇచ్చిన స్పందించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారి పవన్ చెప్పారు. అక్రమ నిర్మాణం ఉపేక్షించమని స్పష్టం చేశారు. అనుమతులు లేని నిర్మాణాన్నింటిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. కొత్తగా విలీనమైన గ్రామాల్లో కూడా టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని వివరించారు.



పాక్షికంగా నిర్మాణం కూల్చివేత

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

శేరిలింగంపల్లి జోన్ బృందం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలు చోట్ల సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మహిళల విద్య కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

- గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరీ ఇన్‌చార్జి అనిల్ మాట్లాడుతూ..సావిత్రీ బాయి పూలే నడిచినబాటలో అందరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుజాత, ఎస్వీకే బాధ్యులు రవీందర్, లైబ్రేరీ రీడర్స్, సిబ్బంది పాల్గొన్నారు.
- రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు నాయకత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలేకు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, సుధీర, టీవీ. మమల, దేవమణి, పావని, క్రాంతి, మమత, శాంత, సుభాషిణి, కృష్ణవేణి, ప్రజ్ఞ, ఫరీదా, వసంత, సునందిని, మహిపాల్ శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.
- చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ప్రీతి, కృష్ణవేణి, స్వప్న పాల్గొన్నారు.
- కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) శేరిలింగంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చందానగర్‌లో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి సి.శోభన్, సీఐటీయూ మండల కార్యదర్శి కృష్ణ, రేణుక, లక్ష్మమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.
- శేరిలింగంపల్లి డివిజన్ సురభికాలనీ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మదర్ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పసునూరి రవీందర్, ప్రధానోపాధ్యాయులు పాండురంగారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో..

నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- లింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ప్రధానోపాధాయయురాలు శైలజ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు ప్రమోదిని, అనుపమ, సరిత, అనిత, రజని, సృజనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జగన్, ఎఫ్‌డబ్ల్యూఫ్ కన్వీనర్ శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయుడు శివకుమార్ పాల్గొన్నారు.



రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



సురభి కాలనీలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



నల్లగండ్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తదితరులు



లింగంపల్లి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



చందానగర్ ప్రభుత్వ పాఠశాలలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



చందానగర్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో..

నిజాయితీతో విధులు నిర్వహించాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న అభిలాష్ బిస్త్

గచ్చిబౌలి: శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ నిజాయితీతో విధులు నిర్వహించాలని ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్, ట్రైనింగ్ ఇంచార్జీ డీజీ అభిలాష్ బిస్త్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ 8వ బెటాలియన్‌లో ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్(ఎస్‌సీటీ పీసీ) పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడంలో మీరే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. 9 నెలల శిక్షణ కాలంలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీటీసీ ప్రిన్సిపాల్, కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సీ.సన్నీ, అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నాగభూషణం, అసిసెంట్ కమాండెంట్లు రహెమాన్, రాంబాబు, పార్థసారథి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని నియంత్రించండి

పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి విజ్ఞప్తి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో నిత్యం వాయు కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కాలుష్యాన్ని నియంత్రించాలని పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, మైహోమ్ అంకుర కాలనీ అధ్యక్షుడు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మైహోమ్ అంకుర కాలనీకి చెందిన పలువురు శుక్రవారం కాలుష్య నియంత్రణ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీలో దుర్వాసన వస్తోందని దీంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

చందానగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. హఫీజ్‌పేట్ డివిజన్‌లోని హుడాకాలనీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వారి వీధుల్లో రంగురంగుల ముగ్గులను వేసి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టిఫౌండేషన్ అధ్యక్షుడు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ మాట్లాడుతూ..పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులని పేర్కొన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తర్వాత భారతీయ సంస్కృతి సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయన్నారు. ఈ తరుణంలో ఏటా ఈ ముగ్గుల పోటీలను సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు దేవి, కృష్ణవేణి, హేమలత, సుమ, అసోసియేషన్ సభ్యులు బాలరోజు, పాలంశ్రీను. మల్లేష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హుడాకాలనీలో ముగ్గుల పోటీలలో పాల్గొన్న స్థానిక మహిళలు

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటాలి



క్రీడాకారులకు ట్రాక్ సూట్లను అందిస్తున్న జిల్లా మాస్టర్స్ అధ్యక్షుడు కొండావిజయ్‌కుమార్

చందానగర్: గచ్చిబౌలి స్టేడియంలో రెండు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటి జిల్లా నుంచి అత్యధిక మెడల్స్ సాధించాలని రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా మాస్టర్లకు శుక్రవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం ట్రాక్ సూట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించడం మనందరికీ గర్వకారణమని, ఇందులో సత్తాచాటి పతకాలు సాధించి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నూనె సురేందర్, కోశాధికారి స్వాతి, శివలీల, స్వప్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. ఆమె మాట్లాడుతూ.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీలోని సొసైటీ కార్యాలయం ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన ఆర్టిజన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్



శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులు తయారు చేసిన పాదరక్షలు ప్రదర్శించిన దృశ్యం

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)లో ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో చర్మ ఉత్పత్తులు తయారు చేసే వృత్తి కళాకారులకు 'హ్యాండ్ క్రాఫ్టెడ్ ఎక్సలెన్స్ ఆఫ్ డిస్‌ప్లే'పేరిట ఆర్టిజన్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. డిసెంబర్ 9 నుంచి శుక్రవారం వరకు మూడు విడతలలో మూడు బ్యాచ్‌లకు అయిదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమం సందర్భంగా తమలోని నైపుణ్యాలతో శిక్షణ పొందిన కళాకారుల అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వృత్తినైపుణ్యం పెంచుకునేలా వృత్తిలో వస్తున్న మార్పులకు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కళాకారులు పాదరక్షలను తయారు చేసేలా వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశంపై ఎఫ్‌డీడీఐ, కేవీఐసీ సంయుక్తంగా ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో డిసెంబర్ 9 నుంచి 13 వరకు మొదటి బ్యాచ్‌వారికి, డిసెంబర్ 16 నుంచి 20 వరకు రెండవ బ్యాచ్ వారికి, మూడవ బ్యాచ్‌కు 23 నుంచి 27వరకు మూడవ బ్యాచ్ వారికి, ప్రస్తుతం 25 రోజులపాటు సాగిన ఈ శిక్షణలో శిక్షణ పూర్తి చేసుకున్న వారితో పాదరక్షలను తయారు చేయించి వాటిని ప్రదర్శించేలా చేశారు. ఈ పాదరక్షలను ఎఫ్‌డీడీఐ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అబ్దుల్ రహమాన్, ఇళయరాజ, చంద్రమణిజోషి, కన్వర్ సింగ్, ఎఫ్‌డీడీఐ విద్యార్థులు తిలకించారు.

రుద్రారం జెడ్పీ పాఠశాలకు జర్మనీ బృందం

పటాన్‌చెరు టౌన్: రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జర్మనీ బృందం శుక్రవారం సందర్శించింది. రెండేళ్ల క్రితం జర్మనీ దేశస్తులు డైట్మర్ షైచ్నర్, వాల్కర్, సెల్వీ, జాన్ ఫ్లోరియన్ల బృందం ఇదే పాఠశాలను సందర్శించి కంప్యూటర్లు, కుట్టుమిషన్లను అందజేశారు. కంప్యూటర్ శిక్షణ, విద్యార్థినులకు కుట్టు శిక్షణ ఎలా ఉందో ఈ బృందం పరిశీలించింది. పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే శిక్షణను రోజ్ ఫౌండేషన్ ప్రతినిధులు జర్మనీ బృందానికి వివరించారు. పాఠశాలలో విద్యార్థులు కుట్టిన బ్లౌజులు, దుస్తులను చూపించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి




రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి కార్పొరేటర్ సింధు వినతిపత్రం అందజేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బొంబాయికాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, మ్యాక్‌సొసైటీ, బీడీఎల్ కాలనీల్లో ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే, ఎల్ఐజీ కాలనీలో కమ్యూనిటీ రోడ్డులో డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే, ఎంఐజీకాలనీలో పారిశుద్ధ్యం సిబ్బంది కేవలం మెయిన్ రోడ్డును మాత్రమే శుభ్రం చేస్తున్నారని కాలనీలోని ప్రతివీధిని శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సురేష్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి ఉన్నారు.

ఐఐఐడీ వేడుకల్లో గీతం విద్యార్థుల ప్రతిభ

పటాన్‌చెరు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు ప్రతిభ చాటి పలువురు మన్ననలు పొందారు. ప్రఖ్యాత డిజైనర్ గీత బాలకృష్ణన్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు నిపుణులు పాల్గొని, హైదరాబాద్‌లోని డిజైన్ కమ్యూనిటీ ఐక్యతను చాటి చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా, అధ్యాపకులు అభిషేక్ కుమార్ సింగ్, స్నిగ్ధారాయ్‌లతో పాటు విద్యార్థులు అనుశ్రీ కలకుంట్ల, భవ్యరెడ్డి, సూర్యకుమారి తదితరులు ప్రాతినిధ్యం వహించారు. ప్రాథమిక దశలోనే అత్యంత ప్రతిభ కనబరిచిన భవ్యరెడ్డి, స్నిగ్ధరాయ్ బృందం, ప్రతిష్టాత్మక తుది పోటీకి చేరుకొని మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ, ఏపీహెచ్‌బీ 4వ ఫేజ్, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 3, గౌలిదొడ్డి, అపర్ణ షంగ్రిల్లా, కేశవనగర్, జయభేరీ ఫేజ్-4, జర్నలిస్ట్ కాలనీ, జీపీఆర్ఏ క్వార్టర్స్, యూకో బ్యాంక్ లేన్, గ్రీన్ ల్యాండ్ కాలనీ, ఖాజాగూడ, సాయి ఐశ్వర్య కాలనీ, సేవీ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వాసవి జీపీ, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, సంధ్య ఎలైట్, సాస్ బిల్డింగ్, ఇందిరానగర్, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్‌నెంబర్ 1,2, నానక్‌రాంగూడ విలేజ్, మనుమాన్ టెంపుల్, ఎస్‌సీ బస్తీ, టీజీఐఐసీ, వైఎస్సార్ భవన్, జయభేరి ఎన్‌క్లేవ్, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

వైట్‌ఫీల్డ్స్‌లో ..

మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైట్‌ఫీల్డ్స్, సిద్ధిఖీనగర్, రోలింగ్‌హిల్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంజయ్యనగర్, రాజీవ్‌నగర్, పీజేఆర్‌నగర్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ పరిసరాలు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మియాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

చందానగర్: మియాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10:20 నుంచి 11 గంటల వరకు ఓల్డ్ ముంబై రోడ్డు, వేముకుంట, రామ్‌రాజ్‌కాటన్ షాప్ వెనుక ప్రాంతం, భెల్ మెయిన్ రోడ్డు, గౌతమీనగర్‌లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వారు వివరించారు.

- 11 కేవీ శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులతో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు శ్రీరామ్‌నగర్, అన్నపూర్ణాఎన్‌క్లేవ్, కినారా హోటల్, గంగారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- 33/11 కేవీ చందానగర్ ఎస్ఎస్ ఫీడర్, 11 కేవీ శ్రీరామ్‌నగర్ ఫీడర పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 గంటల వరకు శిల్పా ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
- 11 కేవీ శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు గౌతమీనగర్, గౌతమీనగర్‌వార్డు ఆఫీస్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం ఎస్‌వీజీ కళావర్షిణీ మ్యూజిక్, డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ గురువులు సంధ్యారాణి కోనూరు, శిష్య బృందంచే కర్ణాటక గాత్రి కచేరి, సంగీత వాయిద్యాలతో పాటలు, భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. లిఖిత, హవిష్, కౌటిల్య వేణువుపై కమల్, బాలకృష్ణ, వరవీణ, కాలభైరవాష్టకం, శాన్వి, నిర్విజ్ఞ కీబోర్డుపై లింగాష్టకం, శ్రీరామ శ్రీరామ, తేజస్వీని వయోలిన్‌పై అచ్యుతం వందే మాతరం తదితర పాటు ఆలపించి అలరించారు. గాత్ర కచేరీలో సరళీస్వరాలు, అంబుజా వాని, జంట స్వరాలు, గణేశ, స్వరపల్లవి, స్వరజతి, అన్నమాచార్య కీర్తనలను కళాకారులు హంసిని, జాహ్నవి, అర్నవి, హన్సశ్రీ, యువన్, మాన్విత తదితరులు ఆలపించి ఆకట్టుకున్నారు. భరతనాట్య ప్రదర్శనలో గణపతి పాలయమాం, గణేశకౌతం తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఐఏఎస్ లక్ష్మి హాజరై ఘనంగా సత్కరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పలు జిల్లాలకు చెందిన మత్స్య సహకార సంఘం చైర్మన్లు, సభ్యులు నీలం మధును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి త్వరలో తగు నిర్ణయం తీసుకుంటారని ఆశాభవం వ్యక్తం చేశారు.